సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 15 । డిసెంబర్ । 2022



గిరిజనుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి

9లో

ప్రజల ఆరోగ్యానికి మరింత భరోసా



జోలాపుట్టులో బాలిక వసతి గృహం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ, జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర

8లో

రోడ్లు, సెల్ టవర్ వ్యవస్థ మెరుగుకు చర్యలు



జిల్లాలో గ్రామీణ రోడ్లు, సెల్ టవర్ల వ్యవస్థ మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

8లో

న్యూస్‌రీల్

నాడు-నేడు పనులు త్వరితగతిన పూర్తి

జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు



హుకుంపేటలో నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

హుకుంపేట: నాడు-నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జేసీ శివ శ్రీనువాసులు ఆదేశించారు. బుధవారం స్థానిక జూనియర్ కళాశాల, కేజీబీవీ పాఠశాలలో మనబడి నాడు-నేడు పనులను పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్, విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థినుల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. మెనూ ప్రకారం అహారం అందించాలని సూచించారు. ఎంఈవో రామచంద్రరావు పాల్గొన్నారు.

30న డాక్ అండ్ పెన్షన్ అదాలత్

మహారాణిపేట(విశాఖ దక్షిణ): పోస్టల్ శాఖ 94వ డాక్ అండ్ పెన్షన్ అదాలత్ డివిజన్ స్థాయి కార్యక్రమం ఈ నెల 30న విశాఖలో నిర్వహిస్తోంది. ఉమ్మడి తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఆర్ఎంఎస్ డాక్/పెన్షన్‌కు సంబంధించి సమస్యలను ఇక్కడ పరిష్కరిస్తారు. ఈ నెల 23వ తేదీలోగా సూపరింటెండెంట్, ఆర్ఎంఎస్ వి డివిజన్, విశాఖపట్నం-530017కు ఫిర్యాదులు పంపాలని డివిజన్ సూపరింటెండెంట్ ఓ ప్రకటనలో తెలిపారు.

రేపటి నుంచి జాతీయ స్థాయి రోల్‌బాల్ పోటీలు

మురళీనగర్(విశాఖ ఉత్తరం): వీఎంఆర్‌డీఏ పార్కు ఎంజీఎం రింక్‌లో 12వ జాతీయ మినీ రోల్‌బాల్ పోటీలు ఈనెల 16వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రోల్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆళ్ల అనిల్‌కుమార్ రెడ్డి, విశాఖ రోల్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షురాలు తోట లలిత ప్రియ, కోచ్ పూసర్ల సంతోష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రోల్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ రోల్‌బాల్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించనున్న ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 21 రాష్ట్రాల నుంచి సుమారు 500 మంది క్రీడాకారులు పాల్గొంటారని చెప్పారు. క్రీడాకారులు గురువారం నగరానికి చేరుకుంటారని వీరికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బాలికలు, బాలుర విభాగాల్లో ప్రత్యేకంగా పోటీలు ఉంటాయన్నారు. విజేతలకు 18వ తేదీన నిర్వహించే ముగింపు ఉత్సవంలో రాష్ట్ర పర్యాటక, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా చేతుల మీదుగా ట్రోఫీలు అందిస్తామన్నారు.

పల్పింగ్ యూనిట్ పనులు వేగవంతం



పల్పింగ్ యూనిట్ పనులను పరిశీలిస్తున్న పీవో గోపాలకృష్ణ

గూడెంకొత్తవీధి: మండల కేంద్రంలో రూ.4 కోట్లతో నిర్మిస్తున్న ఎకో కాఫీ పల్పింగ్ యూనిట్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని పాడేరు ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ ఆదేశించారు. బుధవారం ఆయన నిర్మాణ పనులను పరిశీలించారు. గిరిజన రైతులు సాగుచేస్తున్న కాఫీకి గిట్టుబాటు ధరలు కల్పించాలన్న లక్ష్యంతో పల్పింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీని ద్వారా నాణ్యమైన కాఫీ తయారు చేసి జాతీయ మార్కెట్‌లో మంచి ధరలకు విక్రయించడం వల్ల రైతులకు అదనపు లాభాలు వస్తాయన్నారు. దాదాపు 200 మంది గిరిజనులకు ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు. పల్పింగ్‌కు అవసరమైన యంత్ర సామగ్రి సిద్ధంగా ఉందన్నారు. త్వరలో పనులు పూర్తి చేసి ప్రారంభిస్తామని పీవో వెల్లడించారు.

ఆలస్యంగా సూర్యోదయం



రాజవొమ్మంగి: మండలంలో కొద్దిరోజులుగా మంచు దట్టంగా కురుస్తోంది. ఉదయం 9 గంటల వరకు కురుస్తూనే ఉంటోంది. మరోపక్క చలి వణికిస్తోంది. సూర్యోదయం ఆలస్యమవుతోంది.

కాఫీ రైతు ఖుషీ!



జి.మాడుగుల మండలం వంజరిలో కాఫీ పండ్లను సేకరిస్తున్న గిరిజనులు

ఇన్నాళ్లకు కాఫీ రైతులకు మంచి రోజులు వచ్చాయి. ఒకప్పుడు కాఫీ గింజలు అమ్ముకోవాలంటే గిరి రైతులు నానా అవస్థలు పడేవారు. దళారులు, ప్రైవేట్ సంస్థలు నిర్ణయించిన ధర అమ్మాల్సి వచ్చేది. ప్రస్తుత పరిస్థితి పూర్తిగా భిన్నం. పోటీ పెరిగింది. నేరుగా రైతుల వద్దకు వెళ్లి కొనుగోలు చేస్తుండటంతో నచ్చిన ధరకు అమ్ముకునే సౌలభ్యం ఏర్పడింది. ఐటీడీఏ ఆధ్వర్యంలో మాక్స్ సంస్థ రైతులకు మద్దతు ధర చెల్లిస్తూ లభాలు పంచుతామని చెబుతోంది. మిగతా సంస్థలు కూడా అంతకు మించి ధర ప్రకటించి కొనుగోలు సమయంలోనే నగదు చెల్లిస్తున్నాయి. లాభదాయకమైన ధర చెల్లిస్తూ గిరిజన సహకార సంస్థ కూడా గిరి రైతులను ఆకట్టుకుంటోంది.



- పండ్ల కొనుగోలుకు రైతుల చెంతకు
- పోటీపడుతున్న ప్రైవేట్ సంస్థలు
- నచ్చిన వారికి అమ్ముకునే అవకాశం
- ఇన్నాళ్లకు మంచి రోజులు
- జోరందుకున్న అమ్మకాలు

సాక్షి, పాడేరు: జిల్లాలోని కాఫీ గింజల కొనుగోళ్లపై వ్యాపారులు, అధికారులు, పలు స్వచ్ఛంద సంస్థలు ప్రత్యేకంగా దృష్టి సారించాయి. పండ్ల దశలోనే కాఫీ కొనుగోలుకు ఐటీడీఏ పరిధిలోని మాక్స్ సంస్థతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు పోటీ పడుతున్నాయి.



కందమామిడిలో నాంది సంస్థ కొనుగోలు చేస్తున్న కాఫీ పండ్లు

ఐటీడీఏ అనుబంధంగా..

చింతపల్లి కేంద్రంగా ఐటీడీఏకు అనుబంధంగా పనిచేస్తున్న మాక్స్ సంస్థ కాఫీ పండ్లను కిలో రూ.36లకు కొనుగోలు చేస్తుండగా అరకులోయ కేంద్రంగా ఉన్న నాంది సంస్థతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలన్నీ కిలో రూ.50ల ధరతో కాఫీ పండ్లను కొనుగోలు చేస్తున్నాయి. ఐటీడీఏ ఆదేశాల మేరకు కిలో రూ.36కు కొనుగోలు చేస్తున్న మాక్స్ సంస్థ వచ్చిన లాభాలను తర్వాత పంపిణీ చేస్తామని ప్రకటిస్తున్నప్పటికీ గిరిజనుల్లో అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. మిగతా సంస్థలు మాత్రం కిలోకు రూ.50 ధర చెల్లిస్తూ వెంటనే నగదు అందజేస్తున్నాయి.

సుమారు 10 వేల టన్నుల క్లీన్ కాఫీ..

పాడేరు, చింతపల్లి డివిజన్ల పరిధిలో రెండు లక్షల ఎకరాల వరకు కాఫీ తోటలుండగా 1.56 లక్షల ఎకరాల్లో కాఫీ ఫలసాయం ఇస్తోంది. ఈ ఏడాది కూడా వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో కాఫీ తోటలు విరగ్గాశాయి. సుమారు 10వేల టన్నుల క్లీన్ కాఫీ గింజలను మార్కెటింగ్ చేసే పరిస్థితులు ఉన్నాయి.

పండ్ల దశలోనే అమ్మకంపై ఆసక్తి

పండ్ల దశలోనే కాఫీ పంటను ఐటీడీఏతో పాటు పలు సంస్థలు కొనుగోలు చేస్తుండడంతో రైతులు ఈ విధానానికే ఆసక్తి చూపుతున్నారు. ప్రతి ఆరు కిలోల కాఫీ పండ్లను పల్పింగ్ చేసి ఆరబెట్టడం ద్వారా కిలో పాచ్‌మెంట్ కాఫీ గింజలు ఉత్పత్తి అవుతుంటాయి. ఆరు కిలోల కాఫీ పండ్లను ఐటీడీఏకు కిలో రూ.36ల ధరతో అమ్మకాలు చేయడం ద్వారా రూ.216, నాంది, మన్య తోరణం వంటి ప్రైవేటు సంస్థలకు అమ్మకాలు చేయడం ద్వారా రూ.290 నుంచి రూ.300 ధర పొందే అవకాశం ఏర్పడుతోంది. ఈ పరిస్థితుల్లో గిరిజనులంతా పండ్ల దశలోనే కాఫీని అమ్ముకుంటున్నారు.

నేరుగా రైతుల చెంతకు..

ప్రస్తుతం ఏజెన్సీ వ్యాప్తంగా కాఫీ పండ్ల సేకరణ పనులు జోరందుకోవడంతో ఐటీడీఏ మాక్స్, పలు ప్రైవేటు సంస్థలన్నీ నేరుగా గ్రామాలకు చేరుకుని పోటా పోటీగానే కాఫీ పండ్లను కొనుగోలు చేస్తున్నాయి.



కోట్లగరువులో కాఫీ పండ్లను పల్పింగ్ చేస్తున్న గిరిజనులు

పోటాపోటీగా జీసీసీ

గిరిజన రైతులు కాఫీ పండ్లను సేకరించి పల్పింగ్ చేసిన అనంతరం పాచ్‌మెంట్ కాఫీ గింజలుగా తయారు చేసి చేపడుతున్న అమ్మకాలకు ప్రత్యేక ఆదరణ నెలకొంది. పూర్వం నుంచి పాచ్‌మెంట్ కాఫీని వారపుసంతల్లో ప్రైవేటు వ్యాపారులతో పాటు గిరిజన సహకార సంస్థ కూడా కొనుగోలు చేపడుతూ రైతులను ఆదుకుంటోంది. ఈ ఏడాది జీసీసీ కిలో పాచ్‌మెంట్ కాఫీ గింజలను రూ.270 ధరతో కొనుగోలు ప్రారంభించగా ప్రైవేటు వ్యాపారులు కూడా ఆ సంస్థకు ధీటుగానే గిరిజనుల నుంచి కాఫీ కొనుగోలుకు ఆయా గ్రామాల్లో మకాం వేస్తున్నారు.

గిట్టుబాటు ధరే లక్ష్యం



గిరిజన ప్రాంతాల్లో గిరిజన రైతులు సాగు చేస్తున్న కాఫీ పంటను గిట్టుబాటు ధర కల్పించే లక్ష్యంగా పనిచేస్తున్నాం. చింతపల్లిలోని ఐటీడీఏ పల్పింగ్ యూనిట్ ఆధీనంలోని మ్యాక్స్ సంస్థ ద్వారా కాఫీ పండ్లను కిలో రూ.36 ధరతో కొనుగోలు చేస్తున్నాం. కాఫీ పంట మొత్తం అమ్మకాల ద్వారా వచ్చిన లాభాలన్నింటిని ఆయా కాఫీ రైతులకే పంపిణీ చేస్తాం. కలెక్టర్ సుమిత్‌కుమార్ కూడా కాఫీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించే లక్ష్యంగా పనిచేస్తున్నారు.

–ఆర్.గోపాలకృష్ణ, ఐటీడీఏ పీవో, పాడేరు

సీఎం జగన్‌కు ఆత్మీయ స్వాగతం

గోపాలపట్నం (విశాఖ పశ్చిమ): భీమునిపట్నం మండలం దాకమర్రిలో జరిగిన నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కుమారుడి వివాహ కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ విమానాశ్రయంలో కొద్దిసేపు ఆగారు. ప్రత్యేక విమానంలో బుధవారం మధ్యాహ్నం 3.10 గంటలకు ఆయన విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనతోపాటు మంత్రి బొత్స సత్యనారాయణ, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, అధికారులు వచ్చారు. ఇక్కడి నుంచి 3.22 గంటలకు హెలికాప్టర్‌లో దాకమర్రి బయలుదేరారు. తిరిగి 5.01 గంటలకు విమానాశ్రయానికి చేరుకుని.. 5.12 గంటలకు ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి బయలుదేరారు. ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, విశాఖ జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని, వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కలెక్టర్ ఎ.మల్లికార్జున, సీపీ సీహెచ్ శ్రీకాంత్, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, తదితరులు సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికారు.



ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

గురుకులంలో విద్యార్థుల ఘర్షణ

- ఒకరికి తీవ్ర అస్వస్థత
- పరిస్థితి విషమించడంతో కేజీహెచ్‌కు తరలింపు
- జి.మాడుగులలో ఘటన



చికిత్స పొందుతున్న విద్యార్థి కొండబాబును పరామర్శిస్తున్న గిరిజన సమాఖ్య ప్రతినిధులు

పాడేరు రూరల్: జి.మాడుగుల గిరిజన గురుకుల పాఠశాలలో ముగ్గురు విద్యార్థుల మధ్య ఘర్షణ చోటుచేసుకున్న ఘర్షణలో ఒక విద్యార్థి తీవ్ర అస్వస్థతకు గురై అపస్మారస్థితికి చేరుకున్నాడు. మెరుగైన వైద్యం కోసం అతనిని కేజీహెచ్‌కు తరలించారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలిలావున్నాయి. గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న జర్త కొండబాబు అనే విద్యార్థి ఈనెల ఆరో తేదీ సాయంత్రం వసతి గృహ ఆవరణలో కూర్చొని అంబలి తాగుతున్నాడు. అదే సమయంలో వాలీబాల్ ఆడుతున్న తొమ్మిదో తరగతికి చెందిన ఓ విద్యార్థి వాలీబాల్‌ను కాలితో తన్నాడు. దీంతో ఆ బాల్ కొండబాబుకు తగిలింది. ఈ విషయంలో ఇద్దరి మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. అదేరోజు రాత్రి వసతి గృహంలో నిద్రిస్తున్న కొండబాబుపై వాలీబాల్ తన్నిన విద్యార్థి అతని స్నేహితుడితో కలిసి దాడి చేశాడు. తీవ్ర అస్వస్థతకు గురైన కొండబాబును పాఠశాల క్లాస్ టీచర్, హెల్త్ అసిస్టెంట్ కలిసి సమీపంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం విద్యార్థి కొండబాబును పాఠశాల యాజమాన్యం అతడి స్వగ్రామైన పెదబయలు మండలం మల్లెపుట్టు గ్రామానికి పంపించేశారు. ఇంటికి వెళ్లిన విద్యార్థి కొండబాబు ముక్కు, నోటి నుంచి రక్తం రావడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే తల్లిదండ్రులు బుధవారం పాడేరు జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చారు. వైద్య చికిత్సలు అందిస్తున్నప్పటికి ముక్కు, నోటి నుండి రక్తం ఆగకపోవడంతో మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు.

బాధిత విద్యార్థికి పరామర్శ

పాడేరు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత విద్యార్థి కొండబాబును గిరిజన సమాఖ్య జిల్లా ప్రతినిధులు కూడా రాధాకృష్ణ, జల్లి రాజాబాబు పరామర్శించారు. విద్యార్థి, తల్లిదండ్రులు, పాఠశాల క్లాస్ టీచర్, హెల్త్ అసిస్టెంట్‌తో మాట్లాడారు. ఘర్షణకుకారణాలను విద్యార్థి నుంచి తెలుసుకున్నారు. విద్యార్థి పరిస్థితి విషయంగా ఉందని చెప్పడంతో దగ్గరుండి కేజీహెచ్‌కు పంపించారు. ఘటన జరిగి వారం రోజులైన పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే విద్యార్థి ఆరోగ్య పరిస్థితి విషమించిందని వారు ఆరోపించారు. ఈ ఘటనకు పాఠశాల యాజమాన్యాన్ని బాధ్యులను చేస్తూ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

క్రీడారంగంలోనూ ప్రోత్సాహం

- మంచి భవిష్యత్తే లక్ష్యం
- గిరి యువతకు కలెక్టర్ సుమిత్ కుమార్ సూచన
- పోలీసుల ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు, వైద్యశిబిరం ఏర్పాటు
- పర్యవేక్షించిన ఏఎస్పీలు ప్రశాంత్ శివకిషోర్, అదిరాజ్‌సింగ్‌రాణా



కలెక్టర్ సుమిత్‌కుమార్, ఏఎస్పీలు ప్రశాంత్ కిషోర్, అదిరాజ్‌సింగ్ రాణా

సీలేరు: గిరిజన యువతను క్రీడారంగంలో కూడా పోత్సహించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్, చింతపల్లి, రంపచోడవరం ఏఎస్పీలు ప్రశాంత్ శివకిషోర్, అదిరాజ్‌సింగ్‌రాణా అన్నారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు స్థానిక పోలీసుస్టేషన్ పరిధి మాదిగమల్లులో బుధవారం యువహో వాలీబాల్ పోటీలను, మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మన్యంలోని చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండి మంచి భవిష్యత్తు ఏర్పరుచుకునే దిశగా కృషి చేయాలని సూచించారు. వాలీబాల్ తదితర క్రీడల్లోనూ రాణించి గుర్తింపు తేవాలన్నారు. ఇందుకు అవసరమైన సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇందుకు సంబంధించి జిల్లా కేంద్రాల్లో ఉన్న వసతులను వినియోగించుకోవాలని కోరారు. చింతపల్లి ఏఎస్పీ ప్రశాంత్ శివకిషోర్ మాట్లాడుతూ గిరి యువత అన్ని రంగాల్లో ముందుండాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. వాలీబాల్ పోటీలకు 60 జట్లకు పైగా రావడంతో విశేష స్పందన లభించిందన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న గిరిజనులకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో అమృత, మెడికవర్, ఐకేర్ కు చెందిన వైద్య నిపుణులతో వైద్య శిబిరం ఏర్పాటుచేశామన్నారు. సుమారు 1200 మంది పరీక్షలు చేయించుకోగా 50 మందికి మెరుగైన వైద్యం కోసం మైదాన ప్రాంతాలకు తరలిస్తున్నామన్నారు. మూడువేల మందికి భోజన సదుపాయం ఏర్పాటుచేశామని చెప్పారు. పాల్గొన్న ప్రతీ జట్టుకు ఉచితంగా వాలీబాల్ కిట్లను పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో జీకే వీటీ సీఐ అశోక్‌కుమార్, సీలేరు ఎస్ఐ రామకృష్ణ, డీఎస్పీ వెంకట్రావు పాల్గొన్నారు.

వినతుల స్వీకరణ

మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో బుధవారం ఒకే వేదికపై ఐఏఎస్ అధికారి కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐపీఎస్ అధికారులు చింతపల్లి, రంపచోడవరం ఏఎస్పీలు ప్రశాంత్‌రవికిషోర్, అదిరాజ్ సింగ్‌రాణా గిరిజనుల సమస్యలు తెలుసుకున్నారు. వారికి స్థానికులు వినతి పత్రాలు అందజేశారు. రోడ్లు, విద్యుత్, పాఠశాలలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని, తాగునీరు సదుపాయం కల్పించాలని కోరారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ అందరితో కలివిడిగా మాట్లాడారు. స్పందన కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు.



గిరిజనులకు భోజనాలు వడ్డిస్తున్న కలెక్టర్, ఏఎస్పీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కలెక్టర్, ఏఎస్పీలు

వణికిస్తున్న చలిగాలులు



దట్టంగా కురుస్తున్న మంచు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో మినుములూరు మినహా, అరకులోయ, చింతపల్లిలో ఉష్ణోగ్రతలు పెరిగాయి. బుధవారం పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో 14డిగ్రీలు, అరకులోయలో 17డిగ్రీలు, చింతపల్లిలో 18.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలిగాలులు వీస్తున్నాయి.పాడేరు మినహా అన్నిచోట్ల ఉదయం పొగమంచు కురవగా, సాయంత్రం హుకుంపేటలో వర్షం కురిసింది.

వలంటీర్లపై ఈనాడు తప్పుడు రాతలు తగదు

గ్రామ వలంటీర్ల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొమ్ము సురేష్‌బాబు



పాడేరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను తాము ఏ లాభాపేక్ష లేకుండా ప్రజల గడప వద్దకే అందిస్తుంటే అది చూసి ఓర్వలేక టీడీపీ తోక పత్రిక అయిన ఈనాడులో తప్పుడు కథనాలు రాయడం సరైన పద్ధతి కాదని, పనికిరాని రాతలను మానుకోవాలని గ్రామ వాలంటీర్ల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొమ్ము సురేష్ బాబు హితవు పలికారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ నేడు దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. కరోనా సమయంలో గ్రామ వాలంటీర్ల సేవలు ఈనాడు పత్రికకు తెలియదా అని ప్రశ్నించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రజా సేవకులైన గ్రామ వాలంటీర్లపై రాజకీయ రంగు రాయడానికి ఈనాడు పత్రిక ప్రయత్నిస్తోందన్నారు. గ్రామ వలంటీర్లపై రాజకీయం చేయడం మానుకోవాలన్నారు. గ్రామ వలంటీర్ల సేవలను కించపరిచేలా మనోభావాలను దెబ్బతీసే విధంగా ఈనాడు పత్రికలో ఇటీవల వేగులు, గూఢచారులు, డేగలు అంటూ హెడ్డింగ్‌లు పెడుతూ అసత్యమైన వార్తలు రాయడం తగదన్నారు. ఈ వార్తలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తక్షణమే ఈనాడు యాజమాన్యం గ్రామ వలంటీర్లకు బహిరంగా క్షమాపణలు చెప్పాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు.

అనారోగ్యంతో మరో శిశువు మృతి



జి.మాడుగుల: మండలంలో గెమ్మెలి పంచాయతీ వరిగెలపాలెం గ్రామానికి చెందిన మాతే రవి, సోములమ్మ దంపతులకు చెందిన మూడు నెలల మగ శిశువు అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందాడు. వాంతుల కారణంగా తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. రెండు రోజుల్లో వరుసగా మూడు శిశు మరణాలు సంభవించడంతో పలువురు ఆందోళన చెందుతున్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మాతా శిశు మరణాల నివారణే లక్ష్యం

- ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలతో తల్లీబిడ్డలు సురక్షితం
- అన్ని పాఠశాలల్లో ఫైలేరియా స్క్రీనింగ్ వేగవంతం
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ రామిరెడ్డి ఆదేశం



బురుగుచట్టులో ఫైలేరియా స్క్రీనింగ్ పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఆరోగ్యశాఖ డైరెక్టర్ రామిరెడ్డి



వైద్య ఆరోగ్యశాఖ అధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న రామిరెడ్డి

సాక్షి,పాడేరు: మాతాశిశు మరణాల నివారణే లక్ష్యంగా వైద్యబృందాలు శ్రమించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ వి.రామిరెడ్డి ఆదేశించారు.బుధవారం ఆయన పాడేరు మండలంలో పర్యటించారు. ఆయనకు మోదకొండమ్మ పాదాలు గుడి వద్ద డీఎంహెచ్‌వో జమాల్‌బాషా,ఇతర అధికారులు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మారుమూల బురుగుచట్టు గ్రామాన్ని సందర్శించారు. ఇక్కడ గిరిజన సంక్షేమ పాఠశాలలో ఏర్పాటుచేసిన ఫైలేరియా స్క్రీనింగ్ పరీక్షలను ఆయన పరిశీలించారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు ఈ పరీక్షలను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో మాతాశిశు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న వైద్యసేవల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నెలలు నిండిన గర్భిణులను ఆస్పత్రులకు తరలించి,సుఖప్రసవాలు జరపడం ద్వారా తల్లీబిడ్డలు సురక్షితంగా ఉంటారన్నారు. ఇదే ఆశయంతో వైద్య సిబ్బంది శ్రమించాలని సూచించారు. మినుములూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. మందుల నిల్వలు, రికార్డులు పరిశీలించారు. హోండెలివరీలు లేకుండా ఆస్పత్రులలోనే ప్రసవాలు జరిపి, మాతాశిశుమరణాలను తగ్గించాలని ఆయన ఆదేశించారు. ఆస్పత్రిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహిస్తుండడంపై ఏడీఎంహెచ్‌వో డాక్టర్ లీలాప్రసాద్‌ను అభినందించారు. సాయంత్రం జిల్లా వైద్యారోగ్య కార్యాలయంలో జిల్లాలో వైద్య ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. అన్ని పీహెచ్‌సీల్లో వైద్యులు, సిబ్బంది ఉన్నందున ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.ఖాళీగా ఉన్న ముగ్గురు వైద్యుల పోస్టులను తొందరలోనే భర్తీ చేసేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఐవో డాక్టర్ ప్రభావతి,ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రామ్ సమన్వయకర్త డాక్టర్ విశ్వేశ్వరరావు, విశాఖ,అల్లూరి సీతారామరాజు జిల్లాల డీఎంవోలు మణి, సాంబమూర్తి, మినుములూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

గజ్జె ఘల్లుమన్నాదిరో...

- రెండో రోజూ ఉత్సాహంగా జగనన్న స్వర్ణోత్సవాలు
- అలరించిన ఉత్తరాంధ్ర సంప్రదాయ కళలు


కళాకారులకు ప్రశంసాపత్రం అందజేస్తున్న మంత్రి రోజా

బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు): తమలోని ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పే అవకాశం రావడంతో ఉత్తరాంధ్ర కళాకారులు స్టేజీపై దుమ్మురేపారు. గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను నేటితరం యువతకు తెలిసేలా అద్భుత ప్రదర్శనలతో అదరహో అనిపించారు. సిరిపురంలోని వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న జోనల్‌స్థాయి జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాలు రెండో రోజైన బుధవారం ఉత్సాహంగా సాగాయి. తప్పెటగుళ్లు, కాళికా వేషాలు, పులి వేషాలు, థింసా నృత్యాలు, జానపద గీతాలతో కళాకారులు ప్రేక్షకులను అలరించారు. వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, మంత్రులు రోజా, విడదల రజని, అమర్‌నాథ్ పాల్గొని కళాకారులను ప్రోత్సహించారు. తప్పెటగుళ్లు, థింసా కళా బృందాలతో మంత్రి రోజా నృత్యం చేసి అలరించారు. ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్ కుమార్, అదీప్‌రాజ్, కలెక్టర్ మల్లికార్జున, రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి చైర్‌పర్సన్ వంగపండు ఉష, మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి మరింత భరోసా

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర
- పీహెచ్‌సీ, వసతి గృహం ప్రారంభం


పీహెచ్‌సీ వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న అరకు ఎమ్మెల్యే పాల్గుణ, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

ముంచంగిపుట్టు: ప్రభుత్వం 24 గంటలు ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తుందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఉమ్మడి జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రలు అన్నారు. కిలగాడ పంచాయతీ కేంద్రంలో ట్రైబల్ వెల్ఫేర్ శాఖ ద్వారా రూ.90లక్షలతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ప్రారంభోత్స కార్యక్రమం నిర్వహించారు. అరకు ఎమ్మెల్యే పాల్గుణ, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రలు శిలాఫలకాన్ని ఆవిష్కరించి ఘనంగా ప్రారంభించారు. ఆరోగ్య కేంద్రంపై ఆధారపడి ఉన్న గ్రామాల వివరాలను వైద్యాధికారి రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రం ద్వారా నిత్యం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ప్రభుత్వంలో గిరిజన ప్రాంతంలో ఎన్నడూ లేని విధంగా వైద్య సేవలు మెరుగుపడ్డాయని, గ్రామ స్థాయిలో పీహెచ్‌సిలు, ఆరోగ్య ఉప కేంద్రాలు ఏర్పాటుతో అత్యవసర పరిస్థితుల్లో క్షణాల్లో ఆరోగ్య కేంద్రాలకు చేరుకోవచ్చన్నారు. ప్రజా ఆరోగ్యానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తోందన్నారు.

వైద్యరంగం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ మన్యంలో వైద్యారంగాభివృద్ధి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, పాడేరులో మెడికల్ కళాశాల ఏర్పాటు వల్ల గిరిజనులు వైద్య రంగంలో కూడా ఎదగాలన్నది ముఖ్యమంత్రి జగనన్న ఉద్దేశన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం వల్ల గిరిజనుల గడప వద్దకే వైద్యం అందించడం ఆంధ్రలో తప్ప ఏ రాష్ట్రంలోనూ జరగడం లేదన్నారు. వైద్యులకు, సిబ్బందికి సహకరిస్తూ గిరిజనులు వైద్య సేవలు పొందాలన్నారు.

బాలికల వసతి గృహం ప్రారంభం

మండలంలో గల జోలాపుట్టు పంచాయతీ కేంద్రంలో రూ.3.50కోట్లతో నిర్మించిన ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల వసతి గృహాన్ని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రలుప్రారంభించారు. పాఠశాలకు వసతి సమస్య తీరడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ముఖ్యమంత్రి జగనన్నకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ రాంబాబు, వైస్ ఎంపీపీ భాగ్యవతి, ఏడీఎంహెచ్‌వో లీలాప్రసాద్, ఎంపీడీవో కిరణ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్, పీఆర్ ఏఈఈ మురళీకృష్ణ, ఎస్ఐ రవీంద్ర, ఐసీడీఎస్ సీడీపీవో రాజేశ్వరి, సర్పంచ్‌లు శివశంకర్, నీలకంఠం, రమేష్, రత్న, ఎంపీటీసీలు కొండమ్మ, కమల, నాయకులు జగబంధు, మూర్తి, సూరయ్య, అప్పారావు, కొండలరావు, అర్జున్, దాసు, పులిరాజు,వెంకట్, దామోదంతో పాటు వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు,అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలి


విద్యుత్ ఆదాపై నిర్వహించిన ర్యాలీని ప్రారంభిస్తున్న ఐటీడీఏ పీఓ సూరజ్‌గనోరే

రంపచోడవరం: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలకు అర్హులైన లబ్ధిదారులకు నేరుగా చేరుకునేలా కృషి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వ ఉద్యోగులమైన మనందరిపైనా ఉందని ఐటీడీఏ పీఓ సూరజ్‌గనోరే అన్నారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆధార్‌కార్డుకు బ్యాంక్ ఖాతాల అనుసంధానంపై సంబంధిత అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల క్రితం ఆధార్‌కార్డు చేయించుకున్న అందరూ ఆధార్ కార్డును మరలా అప్‌లోడ్ చేయించుకునేలా చూడాలని ఆధార్ సెంటర్ కో–ఆర్డినేటర్లకు సూచించారు.అనంతరం పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమానికి ముందు విద్యుత్ ఆదాపై నిర్వహించిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఏపీఓ జనరల్ సీహెచ్.శ్రీనివాస్‌రావు, వెలుగు ఏపీడీ ఎ.శ్రీనివాస్‌రావు, ఏడీఎం అండ్‌హెచ్‌ఓ అనుషా, డీఓ కె.కోటేశ్వరరావు, ఏపీడీసీఈఎల్ ఈఈ ఎండీ యూసఫ్, ఈఈలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడికి గాయాలు

బుచ్చెయ్యపేట: బుచ్చెయ్యపేట మండలం విజయరామరాజుపేట బొడ్డేరు వంతెన వద్ద బుధవారం రాత్రి ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. బుచ్చెయ్యపేట ఎస్ఐ కుమారస్వామి అందించిన వివరాలు మేరకు రావికమతం మండలం మత్స్యపురానికి చెందిన నక్క రాజేష్ ద్వి చక్ర వాహనంపై విశాఖ వెళ్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొంది. రాజేష్ కుడి కాలిపై నుంచి బస్సు వెళ్లడంతో కాలు నలిగిపోయి తీవ్ర గాయాలయ్యాయి. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

రోడ్లు, సెల్ టవర్ వ్యవస్థ మెరుగుకు చర్యలు

కలెక్టర్ సుమిత్‌కుమార్


గుమ్మిరేవులలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సీలేరు: జిల్లాలో గ్రామీణ రోడ్లు, సెల్ టవర్ల వ్యవస్థ మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. బుధవారం ఇక్కడికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు.జిల్లాలో 1500 సెల్‌టవర్ల నిర్మాణమే లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. జలజీవన్‌మిషన్ ద్వారా ప్రతి ఇంటికి మంచినీటి సదుపాయం కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లాకు అనుమతి ఇచ్చాయన్నారు. దీంతో 70 శాతం మేర మంచినీటి కొరత తీరుతుందన్నారు. జిల్లాలో 46 పీహెచ్‌సీలు ఉన్నాయని మరో పీహెచ్‌సీకి భవన నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు. జిల్లాలో మరో 400 అంగన్‌వాడీ కేంద్రాలు అవసరముందన్నారు. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. జిల్లాలో రూ.15 కోట్లతో 45 గ్రామాలకు విద్యుత్ సదుపాయం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఆర్‌బీకేల కేంద్రాల ద్వారా రైతులకు సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తూ కాఫీ, మిరియాలు, కూరగాయలు, రాజ్‌మా చిక్కుళ్ల విస్తీర్ణం పెంచేందుకు చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ వివరించారు.

మారుమూల గ్రామాల అభివృద్ధే లక్ష్యం

జిల్లాలో మారుమూల గిరిజన గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. జిల్లాకు అత్యంతదూరంగా ఉన్న మారుమూల అటవీ ప్రాంతమైన గుమ్మిరేవుల పంచాయతీలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్‌లే నాయకులని, వారు గ్రామ గ్రామానికి తిరిగి సమస్యలు తెలుసుకొని స్పందన దృష్టికి తీసుకురావడం గర్వించదగ్గ విషయమన్నారు. పంచాయతీ పరిధిలో రూ.40 లక్షలతో సచివాలయం, రూ.21లక్షలతో ఆర్‌బీకే భవనం, రూ.17లక్షలతో విలేజ్‌క్లినిక్, రూ.9లక్షలతో సంపద తయారీకేంద్రం, రూ.40లక్షలతో నిర్మించిన మంచినీటి పథకాన్ని ప్రారంభించారు. మారుమూల గిరిజన గ్రామాల్లో ఈరోజు సచివాలయం, ఆర్‌బీకే, విలేజ్‌క్లినిక్, సంపద తయారీ కేంద్రాలే ప్రతిపక్షాలకు చెప్పుపెట్టని ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి అన్నారు. గత ప్రభుత్వాల హయాంలో మండల కేంద్రాలకు వందల కిలోమీటర్లు వెళ్లాల్సివచ్చేదని, ఇప్పుడు ఆ పరిస్థితిలేదన్నారు. సర్పంచ్ ఎం.కమలమ్మ, వైఎస్ ఎంపీపీ ఆనంద్, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఈవోఆర్డీ పాపారావు, డీఈ లక్ష్మీనారాయణ, చింతపల్లి, జీకె.వీధి, ధారకొండ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ బీఎస్సీలో ఆరుగురికి సీట్లు


భరత్


లలిత ప్రశాంతికుమారి


శాంతి


గీత

- సాధించిన చింతపల్లి సేంద్రియ వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు
- అభినందించిన ప్రిన్సిపాల్, బోధన సిబ్బంది

చింతపల్లి: స్థానిక సేంద్రీయ వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు ఆరుగురు అగ్రికల్చర్ బీఎస్సీలో ప్రవేశాలకు అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సురేష్‌కుమార్ తెలిపారు. ప్రవేశాల నిమిత్తం బుధవారం గుంటూరులోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన కార్యాలయమైన లాంఫారంలో కౌన్సెలింగ్ జరిగింది. అగ్రిసెట్ ప్రవేశ పరీక్షల్లో మొదటి ర్యాంకు సాధించిన అనకాపల్లికి చెందిన పి.భరత్‌బాబు, 2వర్యాంకు సాధించిన రాజమండ్రికి చెందిన పి. లలిత ప్రశాంతి కుమారి, 3వర్యాంకు సాధించిన గంట్యాడకు చెందిన ఎస్. శాంతి, 5వ ర్యాంకు సాధించిన నరసన్నపేటకు చెందిన ఎస్. గీత, 8వ ర్యాంకు సాధించిన అమృత వర్షిణి, 21 ర్యాంకు సాధించిన సీలేరుకు చెందిన ఎం.హర్షిత అగ్రికల్చర్ బీఎస్సీలో సీట్లు సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ కళాశాల బాపట్ల, నైరా, ఉదయగిరి, రాజమండ్రి, ఎస్.బి.వి.ఆర్ కళాశాల వ్యవసాయ కళాశాల బద్వేలు, కదిరి బాబూరావు కళాశాల సీఎస్ పురంలో వీరు ప్రవేశాలు పొందారని ఆయన తెలిపారు. ఇక్కడి విద్యార్థులు బీఎస్సీలో సీట్లు సాధించడంపై వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్.వీ రాజేంద్ర ప్రసాద్, విద్యార్థి వ్యవహారాల ఇన్‌చార్జ్ డాక్టర్ శ్రీనివాసరావు, వార్డెన్ పి.జోగారావు, సీనియర్ శాస్త్రవేత్తలు సీతారాం, మోహన్, సందీప్ నాయక్, బోధనా సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

గాయపడ్డ కాంట్రాక్ట్ ఉద్యోగి మృతి


నాగంనాయుడు(ఫైల్)

చింతపల్లిరూరల్: మండల కేంద్రంలో మంగళవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్న సంఘటనలో తీవ్రంగా గాయపడిన కాంట్రాక్ట్ ఉద్యోగి బుధవారం ఆస్పత్రిలో మృతి చెందారు. బెన్నవరంకు చెందిన కాంట్రాక్ట్ సేల్స్‌మేన్ సాలబం నాగం నాయుడు ద్విచక్రవాహనంపై వెళుతుండగా ఎదురుగా వస్తున్న మరో వాహనం బలంగా ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన నాగం నాయుడును స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్సల అనంతరం విశాఖపట్నం కేర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతి పట్ల జీసీసీ డీఎం సింహాచలం, సేల్స్‌మేన్‌లు, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు సంతాపం తెలిపారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక


పోటీలకు ఎంపికైన కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూలు విద్యార్థులు

కశింకోట: కశింకోట డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పది మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి కత్తిసాము (ఫెన్సింగ్) పోటీలకు ఎంపికయ్యారు. వీరిలో నలుగురు బాలికలున్నారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అనకాపల్లిలో ఈ పోటీలు జరిగాయి. 17 ఏళ్ల లోపు బాలుర విభాగంలో వై.డేనియల్, ఇ.రాజు, అరుణ్, బాలికల విభాగంలో లావణ్య, 14 ఏళ్ల లోపు బాలుర విభాగంలో రసూల్, ఎం.శరత్, వై.చందురాజు, కె. శ్యామ్‌కుమార్, సాయి గణేష్, బాలికల విభాగంలో డి.వాణి, మాధురి, సాయి గణేష్ ఎంపికయ్యారు. వీరంతా త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల హెచ్‌ఎం ఎ.శ్రీధర్‌రెడ్డి, పీడీ వి.ప్రభాకరరావు తెలిపారు. వీరిని పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ బి.దీప, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

మూడు తులాల బంగారం, నగదు అపహరణపై ఫిర్యాదు


నగదు అపహరణకు గురైన బీరువా

రోలుగుంట: రత్నంపేట గ్రామంలో ఒక ఇంట్లో మూడు తులాల బంగారం, రూ.8వేలు నగదు అపహరణకు గురైనట్టు బాధితురాలు శనివాడ లక్ష్మి బుధవారం రాత్రి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన భర్త అయ్యప్పస్వామి యాత్రకు వెళ్లి వచ్చారని, తాము ఇంట్లో స్వామి వారి పూజ చేయించుకోవడానికి పూజ సామాన్ల కోసం డబ్బులు తీసుకోవడానికి బీరువా తీయగా రూ.8వేల నగదు, మూడు తులాల బంగారం కనిపించలేదని తెలిపింది. పూజ చేసే ముందురోజు బీరువాలో నగదు,బంగారం ఉన్నాయని, పూజ రోజు కనిపించలేదని ఫిర్యాదులో పేర్కొంది.

విశాఖ కేంద్రంగానే సినిమాలు తీస్తా

వర్ధమాన టాలీవుడ్ హీరో రాఖీ


చిత్రంలోని ఓ సన్నివేశంలో హీరో, హీరోయిన్ రాఖీ, సుహాస్

నర్సీపట్నం: స్థానిక అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లోనే సినిమాలు తీస్తానని హీరో రాఖీ తెలిపారు. చింతపల్లి, లంబసింగిలో సినిమా షూటింగ్ ముగించుకుని నర్సీపట్నం చేరుకున్న ఆయన సాక్షితో ముచ్చటించారు. శ్రీపద క్రియేషన్స్ బ్యానర్‌పై తుపాను హెచ్చరిక చిత్రాన్ని తీస్తున్నట్టు తెలిపారు. ఈ చిత్రంలో హీరోగా తాను, హీరోయిన్‌గా సుహాస్ నటించినట్లు చెప్పారు. చిత్రం షూటింగ్ మొత్తం విశాఖ, అల్లూరి, అనకాపల్లి జిల్లాల్లోని సుందరమైన పర్యాటక ప్రాంతాల్లోనే జరిగిందన్నారు. నిర్మాతలుగా డా.శ్రీనివాసుకృష్ణ, సుధీర్, రజనీకాంత్, దర్శకత్వ బాధ్యతలు జగదీష్ కె.కె. నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. చిత్రం షూటింగ్ మొత్తం పూర్తయిందని, పోస్టు ప్రొడక్షన్ పనులు పూర్తి చేసి, ఉగాదికి సినిమాను రిలీజ్ చేయనున్నట్టు తెలిపారు. యూత్‌తోపాటు, అన్ని వర్గాలను ఆకట్టుకునే కథాంశంతో చిత్రం రూపొందినట్టు పేర్కొన్నారు. తుపాను హెచ్చరిక చిత్రం అన్ని వర్గాలను ఆకట్టుకుంటుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. తాను నటించిన మరో బండిరా చిత్రం ఈ నెలలోనే విడుదల అవుతుందన్నారు. పాడుతా తీయగా సింగర్ ధీరజ్‌ను ఈ సందర్భంగా హీరోకు పరిచయం చేశారు. తన సినిమాలో పాటలు పాడేందుకు తప్పని సరిగా అవకాశం కల్పిస్తానని హీరో రాఖీ హామీ ఇచ్చారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ జట్టుకు ఎంపిక పోటీలు

అనకాపల్లిటౌన్: స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లా అండర్–14 బాలుర క్రికెట్ ఎంపిక పోటీలు జరిగాయి. ఈ పోటీలను అనకాపల్లి ఎంఈవో దివాకర్ ప్రారంభించారు. పోటీల్లో జిల్లా నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొన్నట్టు ఎంపిక ఇన్‌చార్జి కె.ఎం.నాయుడు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు జిల్లా తరపున రాష్ట్ర స్థాయి అండర్–14 క్రికెట్ పోటీల్లో పాల్గొంటారని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ఎంఈవో దివాకర్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయన్నారు.

అదృశ్యమైన విద్యార్థిని పెళ్లి చేసుకుని వరుడితో ప్రత్యక్షం


వివాహం చేసుకున్న నర్సింహమూర్తితో అశ్విని

రోలుగుంట: మండలంలో బుచ్చింపేట గ్రామానికి చెందిన విద్యార్థిని గుడివాడ అశ్విని ఈ నెల 5న ఇంటి నుంచి వెళ్లి పోయియి వివాహం చేసుకొని మంగళవారం రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యక్షమైంది. దీనికి సంబంధించి పోలీసులు, స్థానికులందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గుడివాడ అశ్విని(20)కి ఇదే గ్రామానికి చెందిన వంటాకుల నర్సింహమూర్తి(26)తో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. ఆమెకు ఇంట్లో వివాహ సంబంధం చూస్తున్నారు. అది ఇష్టంలేని అశ్విని ఈ నెల 5న కళాశాలకు వెళ్తున్నట్టు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆమె తల్లి గుడివాడ కాంతం బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు స్థానిక ఎస్ఐ, సిబ్బందితో కలసి విచారణ చేపట్టారు. విషయం తెలుసుకున్న అశ్విని తన ప్రియుడైన నర్సింహమూర్తితో విశాఖలో ఒక కళ్యాణమండపంలో వివాహం చేసుకొని మంగళవారం రాత్రి 10:30 గంటలు దాటిన తరువాత స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తాను మేజరునని, వివాహం చేసుకున్నట్టు తెలిపింది. కళ్యాణ మండపం వారిచ్చిన ధ్రువపత్రాన్ని ఆమె పోలీసులకు అందజేసిందని పోలీసులు బుధవారం రాత్రి విలేకరులకు తెలిపారు.


పంచాయతీ కార్యదర్శి అలసత్వంపై విచారణ

- ఉద్రిక్తతల నివారణకు పోలీసు బందోబస్తు ఏర్పాటు
- విచారణాంశాలను కలెక్టర్‌కు నివేదిస్తామన్న డీఎల్‌పీవో మూర్తి

నాతవరం: సంక్షేమ పథకాలు సక్రమంగా ప్రజలకు అందించడం లేదని పంచాయతీ కార్యదర్శి హుస్సేన్‌పై లోకాయుక్త కోర్టులో దాఖలైన ఫిర్యాదు మేరకు బుధవారం నర్సీపట్నం డివిజనల్ పంచాయతీ అధికారి ఎంఎస్‌వీఎస్ మూర్తి విచారణ జరిపారు. మండలంలో గన్నవరం సచివాలయ పరిధిలో గల వై.బి.పట్నం పంచాయతీలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు ఇవ్వడం లేదని పంచాయతీ కార్యదర్శి హుస్సేన్‌పై అదే గ్రామానికి చెందిన మాజీ డీసీసీబీ డైరెక్టర్, కొందరు గ్రామస్తులు లోకాయుక్త కోర్టులో కేసు వేశారు. లోకాయుక్త కోర్టు గ్రామంలో విచారణ చేయాలని కలెక్టర్‌ను ఆదేశించింది. దీంతో డీఎల్‌పీవో మూర్తి గత బుధవారం గ్రామంలో విచారణకు వెళ్లగా ఫిర్యాదుదారులు లేకపోవడంతో విచారణను వాయిదా వేశారు. మరల ఇద్దరికి నోటీసులు జారీ చేసి బుధవారం వై.బి.పట్నం గ్రామంలో విచారణ చేపట్టారు. అయితే ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో డీఎల్‌పీవో ముందస్తుగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ముందుగా లోకాయుక్త కోర్టులో ఫిర్యాదు చేసిన డీసీసీబీ మాజీ డైరెక్టర్ కూండ్రపు అప్పలనాయుడిని, మరి కొందరిని డీఎల్‌పీవో మూర్తి విచారించారు. తర్వాత పంచాయతీ సర్పంచ్ గొర్లె వీర వెంకట సత్యవేణి, కార్యదర్శి హుస్సేన్, ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావును విచారించారు. లోకాయుక్త కోర్టు, కలెక్టర్ ఆదేశాలను అనుసరించి గ్రామంలో ఇద్దరిని విచారించామని, విచారణాంశాలను కలెక్టర్‌కు నివేధిస్తామని మూర్తి తెలిపారు.

సమగ్ర ప్రణాళికలతో గ్రామాల అభివృద్ధి

ఏపీఎస్ఐఆర్డీ డైరెక్టర్ జె.మురళి


గ్రామ అభివృద్ధి ప్రణాళికల గురించి వివరిస్తున్న ఏపీఎస్ఐఆర్డీ డైరెక్టర్ మురళి

అనకాపల్లి రూరల్: గ్రామ పంచాయతీల్లో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అభివృద్ధి ప్రణాళికలు పక్కాగా రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఐఆర్డి) డైరెక్టర్ జె.మురళి సూచించారు. అనకాపల్లి మండలం సంపతిపురం హార్ట్‌ఫుల్‌నెస్ కేంద్రంలో బుధవారం జరిగిన గ్రామ పంచాయతీ, అభివృద్ధి ప్రణాళిక తయారీపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే స్పష్టమైన ప్రణాళికలు ఉండాలన్నారు. ప్రణాళికాబద్ధంగా పనిచేస్తేనే సత్ఫలితాలుంటాయన్నారు. గ్రామ అభివృద్ధి ప్రణాళిక తయారు చేసే విధానంపై శిక్షణను ప్రతి ఒక్కరు సద్వినియోగపరచుకోవాలని సిబ్బందికి సూచించారు. అభివృద్ధి ప్రణాళిక తయారు చేసే విధానంపై మాస్టర్ ట్రైనర్ సుధాకర్, రిసోర్సు పర్సన్లు శ్రీనివాస్, త్రినాథ్ శిక్షణ ఇచ్చారు. అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనకు గ్రామ పంచాయతీల్లో ట్రాన్సిట్ వాక్ నిర్వహించి సమస్యలను గుర్తించాలని పంచాయతీ కార్యదర్శులకు తెలిపారు. అనంతరం వాటిని ప్రాధాన్యతా క్రమంలో ప్రణాళికలో చేర్చాలన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల తయారీ విధానాన్ని, వాటి ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో జిల్లాపరిషత్ సీఈవో శ్రీరామ్మూర్తి, అనకాపల్లి, అల్లూరి జిల్లా పంచాయతీ అధికారులు శిరీషారాణి, కొండలరావు, అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఎంపీడీవో డి.చంద్రశేఖర్, గ్రామ సర్పంచ్ నంబారు నాగమణి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం వెల్ఫేర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, నరేగా వీఆర్పీలు పాల్గొన్నారు.